## క్లుప్తంగా

### నోట్ పుస్తకాలు సిద్ధం



అంగర హైస్కూల్‌లో పుస్తకాలను దించుతున్న సిబ్బంది

**కపిలేశ్వరపురం:** ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. పాఠశాలలు తెరవగానే వాటిని విద్యార్థులకు అందజేసేందుకు ముందస్తుగా పుస్తకాలను క్షేత్ర స్థాయికి చేర్చుతోంది. అందులో భాగంగా ఆదివారం మండలానికి 21,362 నోట్ పుస్తకాలు చేరాయి. సింగిల్ రూలు పుస్తకాలు 9,997, బ్రాడ్ రూల్ పుస్తకాలు 2,173, వైట్ పుస్తకాలు 9,192 రాగా వాటిని అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ప్రత్యేక గదిలో భద్రపరిచారు. త్వరలో వాటిని పాఠశాలల హెచ్ఎంలకు అందజేయనున్నట్టు ఎంఈఓ కె.తాతారావు తెలిపారు. ఎంఐఎస్ టి.సురేష్, సీఓ సత్యనారాయణ, సీఆర్పీలు తాతారావు, వెంకటేష్, సరిత తదితరులు పాల్గొన్నారు.

### సత్తెమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

**బిక్కవోలు:** పందలపాకలోని సత్తెమ్మతల్లి జాతర సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ఐదు రోజులుగా జరుగుతున్న ఈ జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

### వృద్ధురాలికి వైద్యం

**పెదపూడి:** రామేశ్వరంలో ఓ వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతుండగా అటుగా వస్తున్న పెదపూడి ఎస్సై పి.వాసు ఆమెను చూసి, వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు తరలించి వైద్యం అందించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం రామేశ్వరం గ్రామంలో లక్ష్మి అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమెతో మాట్లాడగా చాలా నీరసంగా ఉందని, వెంటనే 108 వాహనానికి కాల్ చేసి కాకినాడ తరలించినట్టు ఎస్సై తెలిపారు. ఆమెకు బంధువులు ఉన్నప్పటికి వదిలేశారని చెప్పిందన్నారు. ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. వైద్యం అనంతరం ఏదో ఒక ఆశ్రమంలో చేర్చనున్నట్టు ఆయన తెలిపారు.

### ప్రభుత్వ ప్రోత్సాహంతో సత్ఫలితాలు

**అనపర్తి:** విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహం సత్ఫలితాలను ఇస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం పందలపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మాడెం దినేష్ వీర గణేష్‌కుమార్ 589 మార్కులు సాధించాడు. ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా గణేష్‌కుమార్‌తో పాటు పాఠశాల హెచ్ఎం సీహెచ్‌వీ సోమిరెడ్డి, పాఠశాల అధ్యాపకులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి చేయడంతోపాటు అన్ని వసతులు కల్పించిందన్నారు. దీనిని అందిపుచ్చుకున్న విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారని అన్నారు.

### రైతులకు అండగా ప్రభుత్వం

**రాజానగరం:** అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని, రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అడబాల చినబాబు అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా అన్నదాతలకు ఈ విధంగా అండగా నిలిచింది లేదన్నారు. తడిచిన, రంగు మారిన సరే రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మద్దుతు ధరకే కొనాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారన్నారు. అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారానే ఈ కొనుగోళ్లు జరుగుతాయన్నారు.

### విద్యార్థినికి అభినందన

**రంగంపేట:** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నాయుడు వీర హాసిని 541 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఆదివారం గ్రామ సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకుడు జాస్తి సత్తిబాబు దంపతులు హాసినిని అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

**రాజానగరం:** అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 60 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిందని స్థానిక ఎస్సై జుబేర్ తెలిపారు. మండలంలోని పాతతుంగపాడులో ఈనెల 27న రోడ్డు పక్కన సొమ్మసిల్లి పడిపోయిన ఆమెను స్థానికుల సాయంతో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని సీఐ కాశీ విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు.

# సెలవుల్లో సరదాగా..

- నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు
- క్షేత్ర స్థాయి గ్రంథాలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- రెండు నియోజకవర్గాల్లో 11 గ్రంథాలయాలు



మండపేట గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

**కపిలేశ్వరపురం:** విద్యా సంవత్సరం ముగిసింది. విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చారు. పది, ఇంటర్ ఫలితాలు సైతం విడుదలయ్యాయి. ఈ వేసవి సెలవుల సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తోంది. సోమవారం నుంచి శిబిరాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ కథనం..

**విజ్ఞాన శిబిరాలు నిర్వహణ ఇలా..**

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం నుంచి జూన్ 11వ తేదీ జరగనున్నాయి. ఈ పాఠాలు పాఠశాలలు తెరిచే వరకూ 32 రోజుల పాటు కొనసాగుతాయి. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఆదేశాలపై నిర్వహించే శిబిరాలను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దూలం పద్మ, కార్యదర్శి వీఎల్ఎస్ఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షించనున్నారు. 6, 10 తరగతి విద్యార్థులపై దృష్టి సారిస్తున్నారు. పఠనం, సరదా అనే రెండు కాన్సెప్టులతో నిర్వహించే శిబిరంలో పుస్తకాలను చదివించడం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు నిర్వహించడం, చెస్, క్యారెమ్స్ తదితర ఆటలపై అవగాహన కల్పించడం చేస్తారు. జీవితంలో విజయం సాధించి స్ఫూర్తిదాయకంగా నిలిచిన ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధులు, సామాజిక రంగంలో రాణించిన వారి జీవిత చరిత్ర పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఆంగ్లభాషను నేర్పుతారు. ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకూ కథలు వినడం, 10 వరకూ పుస్తకాన్ని చదవడం, తర్వాత పది నిమిషాలు పాటు విరామం, 10.10 గంటల నుంచి 10.30 గంటల వరకూ కథలు చెప్పడం, 11 గంటల వరకూ ఇంగ్లిష్ భాష, డ్రాయింగ్, పెయింటింగ్ నేర్చుకోవడం, 12 గంటల వరకూ డ్యాన్స్, చెస్ ఇతర గేమ్స్‌లో తర్ఫీదు పొందడమూ చేయనున్నారు.

**రెండు నియోజకవర్గాల్లో గ్రంథాలయాలు ఇలా..**

| మండలం | గ్రంథాలయాలు |
|---|---|
| మండపేట అర్బన్ | గ్రేడ్–3 – 01 |
| రాయవరం | గ్రేడ్–3 – 02 |
| కపిలేశ్వరపురం | గ్రేడ్–3 – 02 |
| రామచంద్రపురం | గ్రేడ్–1 – 01 |
| రామచంద్రపురం రూరల్ | గ్రేడ్–3 – 02 |
| కె.గంగవరం | గ్రేడ్–3– 02 |
| కాజులూరు | గ్రేడ్–1– 01 |
| మొత్తం | గ్రేడ్–1 రెండు, గ్రేడ్–3 తొమ్మిది |

**విజ్ఞాన సముపార్జనే ధ్యేయం**



పాఠకుల విజ్ఞాన సముపార్జనే ధ్యేయంగా గ్రంథాలయ సంస్థ కృషి చేస్తోంది. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయి. క్షేత్రస్థాయిలో శిబిరాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేశాం. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా గ్రంథాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాలకు 2021లో రూ.1.22 కోట్లతో 1,06,903 పుస్తకాలను సమకూర్చింది. పుస్తకాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను కొనసాగుతోంది.

– దూలం పద్మావతి, చైర్‌పర్సన్, జిల్లా గ్రంథాలయ సంస్థ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

### దేశం గర్వించదగ్గ కవి రవీంద్రనాథ్ ఠాగూర్

**కాజులూరు:** దేశం గర్వించదగ్గ మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అని, ఆయన రచించిన జాతీయ గీతం ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాతి పొందిందని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు, గ్రామ ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి అన్నారు. గ్రామంలో స్థానిక అలయన్స్‌క్లబ్ సభ్యులు ఆదివారం జాతీయగీతం రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ 162వ జయంతిని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఠాగూర్ రచించిన గీతాంజలి కావ్యానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి లభించిందన్నారు. అంత గొప్ప కావ్యం క్రమేపి ప్రజాదరణ కోల్పోతుందని, దేశంలో ప్రతీ ఒక్కరూ జాతీయగీతం పటించాలన్నారు. ఠాగూర్ చిత్రపటానికి సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో క్లబ్ జెడ్సీలు వీరవల్లి గణపతి, కె.గణేష్‌కుమార్, సభ్యులు దుర్గా రాజశేఖరరెడ్డి, అంజి, చిన్నా, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు పోలేరమ్మ జాతర

**రాయవరం:** వెదురుపాక గ్రామ దేవతగా అలరారుతున్న పోలేరమ్మ జాతర సోమవారం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఏటా వైశాఖ మాసంలో అమ్మవారి జాతరను నిర్వహించడం పరిపాటి. అమ్మవారి జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. మంగళవారం ఉదయం అమ్మవారి తీర్థం జరగనుంది.

# మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి



మంత్రి క్యాంపు కార్యాలయంలో అల్లూరికి నివాళులు అర్పిస్తున్న మంత్రి వేణు



అల్లూరికి నివాళులర్పిస్తున్న శ్రీరామవర్మ తదితరులు



నామవానిపాలెంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

**రామచంద్రపురం:** దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ వారిని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మంత్రి వేణు తనయుడు నరేన్, పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, సత్తి శంకరరెడ్డి, రాష్ట్ర హితకారిణీ సమాజం డైరెక్టర్ దొమ్మలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ద్రాక్షారామలో..**

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని ద్రాక్షారామలో ఆధ్వర్యంలో అన్నాయిపేట సెంటర్ వద్ద భీమేశ్వర గూడ్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు వెంటపల్లి భీమశంకరం, వెంటపల్లి రామకృష్ణ, పాలిక ధనరాజు, పాలిక కృష్ణ, కొల్లి రమేష్, అద్దంకి మహేశ్వరరావు, దోమాడ సీతారాముడు, చల్లపూడి పట్టాభిరామయ్య పాల్గొన్నారు.

**అల్లూరికి ఘన నివాళి**

**మండపేట:** ద్వారపూడిలోని క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ, క్షత్రియ సేవా సమితి నాయకులు గూడూరి సుబ్బరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు నడంపల్లి సత్యనారాయణరాజు, రుద్రరాజు నీలాద్రిరాజు, సయ్యపురాజు నారాయణరాజు, శ్రీనురాజు, వెంకటేశ్వరరాజు, గణపతిరాజు రంగరాజు, శ్రీనివాసరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు తొంటాపు సత్తిపండు, ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

**అల్లూరి త్యాగనిరతి స్ఫూర్తిదాయకం**

**కపిలేశ్వరపురం:** స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన జనం ఆశాజ్యోతి అల్లూరి సీతారామరాజు త్యాగ నిరతి నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండలంలోని అంగర థియేటర్ సెంటర్, పీహెచ్‌సీల వద్ద ఉన్న అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కపిలేశ్వరపురం, కోరుమిల్లి గ్రామాల్లో అల్లూరి వర్ధంతిని నిర్వహించారు.

**అల్లూరి ఆశయాలు యువతకు ఆదర్శం కావాలి**

**కాజులూరు:** విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలు నేటి యువతకు ఆదర్శంకావాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పీడీఎస్‌యూ అధ్యక్షుడు బి.సిద్ధూ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. నామవానిపాలెంలో గ్రామ సర్పంచ్ భూపతిరాజు వెంకటసూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ సీతారామరాజు బ్రిటీష్ తెల్లదొరల పాలనపై తిరుగుబాటుకు తూర్పు గోదావరి జిల్లా నుంచే సమరశంఖం పూరించారన్నారు. ఆయన గుర్తుగా జిల్లాల విభజనలో ఏజెన్సీ జిల్లాకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాగా నామకరణం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. దుగ్గుదుర్రులో అమలాపురం బీసీ సంక్షేమసంఘం కన్వీనర్ కడలి రాంపండు ఆధ్వర్యంలోనూ, జగన్నాథగిరిలో బీజేపీ జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కాకర్లపూడి రామరాజు ఆధ్వర్యంలోనూ అల్లూరి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాలన

**కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి వేణు**



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

**రామచంద్రపురం రూరల్:** ప్రజల మనోభావాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని ఓడూరు ఓంకారపురంలో కోదండ రామస్వామి నూతన ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మనోభవాలను గుర్తించి నియోజకవర్గంలోని 76 దేవాలయాల నిర్మాణాలకు ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు, చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, పెదపూడి సీతారామంల బ్రహ్మత్వంలో పాతూరి వీర్రాజు, అచ్చమాంబ దంపతులుతో విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేశారు. కార్యక్రమంలో మంత్రి వేణు తనయుడు నరేన్, బుంగ రాజు, ఎంపీటీసీ పరమటి జ్ఞానలక్ష్మి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, కమిటీ పెద్దలు మనుము సురేష్, పెంకే వీర్రాజు, కుక్కల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**రామాలయాలకు శంకుస్థాపన**

**రామచంద్రపురం రూరల్:** వెల్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మూడు రామాలయాలకు శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమా టోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదివారం పాల్గొన్నారు. పెద్ద శెట్టిబలిజపేటలో పెద్ద మేడిశెట్టి సత్యనారాయణ, ఇతర పెద్దల ఆధ్వర్యంలో కోదండ రామాలయం నిర్మిస్తున్నారు. పల్లపు వీధిలో పెద్దలు కలిగినేడి వెంకన్న, తోట వీరభద్రరావు, వట్టికూటి ఏసుబాబు, పెద్దిరెడ్డి రాంబాబుల ఆధ్వర్యంలో రామాలయం నిర్మాణం, గ్రంథాలయం వీధి శెట్టిబలిజపేటలో కొప్పిశెట్టి సత్తిబాబు, మేడిశెట్టి రాజు, అనుసూరి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో రామాలయ నిర్మిస్తున్నారు. గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ చిక్కాల స్వామి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంతగడ విజయప్రసాద్, సొసైటీ చైర్మన్ వెంకటసుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ అన్యం శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఆరిఫ్‌కు ఘన సత్కారం



సర్పంచ్ ఆరిఫ్‌ను సత్కరిస్తున్న మాచవరం ఏరియా ఇటుకబట్టీ అసోసియేషన్ ప్రతినిధులు

**రాయవరం:** గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సోమేశ్వరం సర్పంచ్ ఆరిఫ్‌ను మాచవరం ఏరియా ఇటుకబట్టీ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. కేంద్ర ప్రభుత్వం 2021–22 సంవత్సరానికి ప్రకటించిన ఉత్తమ పంచాయతీల కేటగిరీలో జిల్లాలో మూడు, మండల స్థాయిలో తొమ్మిది అవార్డులను సోమేశ్వరం పంచాయతీ కైవసం చేసుకున్న నేపథ్యంలో సర్పంచ్‌ను బట్టీ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాచవరం ఏరియా ఇటుకబట్టీ అసోసియేషన్ ప్రతినిధులు ద్వారంపూడి చినరెడ్డి, నల్లమిల్లి వెంకటకృష్ణారెడ్డి(చంటిబాబు), రొంగల శ్రీనివాసరావు, పేకేటి పెదకాపు, మధుసూధనరెడ్డి(మధు) తదితరులు మాట్లాడుతూ పిన్న వయస్సులోనే పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఆరిఫ్ పదవికే వన్నెతెస్తున్నట్లు పేర్కొన్నారు. మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడిగా ఎన్నికైన ఆరిఫ్ రాజకీయంగా మరిన్ని పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు. సమావేశంలో ఇటుకబట్టీ అసోసియేషన్ ప్రతినిధులు మేడపాటి సురేష్‌రెడ్డి(బుజ్జి), చిర్ల వీర్రెడ్డి, సోమేశ్వరం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, ఇటుకబట్టీ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# సమస్యలు లేకుండా ధాన్యం తరలించండి



రైతులతో మాట్లాడుతున్న జేసీ ధ్యానచంద్ర

**కపిలేశ్వరపురం:** ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని మండల అధికారులను జాయింట్ కలెక్టర్ హెచ్ఎం ధ్యానచంద్ర ఆదేశించారు. మండలంలోని టేకి, పడమర ఖండ్రిక గ్రామాల్లో ధాన్యం తరలింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. టేకిలో తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్‌లను ఆర్బీకేలో రైతులు నమోదు, ఎంత ధాన్యం కొనుగోలు చేశారు అనే దానిపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడి ధాన్యం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తరలింపులో పలు సూచనలను చేశారు. ఆయన వెంట వీఆర్వోలు, ఆర్‌బీకేల వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

**కె.గంగవరం మండలంలో..**

**కె.గంగవరం:** వ్యవసాయ క్షేత్రాల్లోనూ, రహదారులపై ఆరబెట్టిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలని మండల అధికారులను జేసీ ధ్యానచంద్ర ఆదేశించారు. మండలంలోని దంగేరు, పామర్రు గ్రామాలను ఆయన సందర్శించారు. వరికోతలు, తడిచిన ధాన్యం వివరాలను మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు. తడిచిన ధాన్యంను కొనుగోలు చేస్తామని రైతులకు ధైర్యం చెప్పారు.

### రైతులు అప్రమత్తంగా ఉండాలి



కాపవరంలో రైతులకు సూచిస్తున్న ఏఓ సత్యప్రసాద్

**రామచంద్రపురం రూరల్:** రాబోయే రెండు రోజుల్లో తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని హసన్‌బాద, వెల్ల, కాపవరం తదితర గ్రామాల్లో పర్యటించిన ఏఓ రైతులను కలిసి పలు సూచనలు చేశారు. ధాన్యం రాశులను మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు తోడుగా ఉండాలన్నారు.

# పేద విద్యార్థినికి లయన్స్ క్లబ్ సాయం

**మండపేట:** పట్టణానికి చెందిన పేద విద్యార్థిని ఆదివారం లయన్స్ క్లబ్ సభ్యులు సాయం అందించారు. కె.భార్గవి రాజానగరంలో ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుకుంటోంది. ఆమె విద్యాభివృద్ధికి క్లబ్ అధ్యక్షుడు గుండు వీరతాతరాజు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. క్లబ్ సభ్యులు ఎల్‌వీ నాగేంద్ర బాబు, చెన్నా రాంబాబు, కోనే వీర్రాజు, ఎంవీ రమణారావు, అబ్బాస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# సోమేశ్వరం.. అభివృద్ధికి ఆదర్శం

- గ్రామంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం
- రెండేళ్లలో రూ.6.35 లక్షలతో అభివృద్ధి పనులు
- ఉత్తమ పంచాయతీగా అవార్డులు



అభివృద్ధికి నిదర్శనంగా నిలిచిన సోమగుండం



33 కేవీ సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు(ఫైల్)

**రాయవరం:** కృషి, పట్టుదల ఉంటే మనుషులు చేయలేని పనంటూ ఏమీ లేదు. 27 ఏళ్ల వయస్సులోనే సర్పంచ్ పదవిని చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించి, నలుగురికీ ఆదర్శంగా నిలిచారు ఆరిఫ్. గ్రామంలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించి పలువురి మన్ననలు పొందారు. ఆరీఫ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తుల సహకారంతో గత రెండేళ్లలో దాదాపు రూ.6.35కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. దీర్ఘకాలంగా గ్రామాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలను పరిష్కరించారు. అది ఏ గ్రామమో కాదండి సోమేశ్వరమే.

**1.23 కోట్లతో రహదారులు, డ్రైన్ల అభివృద్ధి**

గ్రామంలో దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకొని పలు రహదారులు సీసీ రోడ్లుగా రూపుదిద్దుకున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్, 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.1.23 కోట్లతో 20 చోట్ల సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు, డ్రైనేజీలను ఏర్పాటు చేశారు. డ్రైనేజీలు లేక మురికికూపంగా ఉన్న గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దారు.

**అభివృద్ధికి నిదర్శనం సోమగుండం**

చారిత్రక శివాలయంగా ప్రసిద్ధి పొందిన శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న సోమగుండం సుందరీకరణకు తార్కాణంగా నిలిచింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాశీలో మాదిరిగా ఆలయానికి ఎదురుగా సోమగుండం, దానికి ఆవలవైపున ఉన్న రుద్రభూమిని ఒకే సమయంలో అభివృద్ధి చేశారు. దాతల విరాళం, 14,15 ఆర్థిక సంఘం నిధులతో సోమగుండం దక్షిణం వైపు రక్షణ గోడ నిర్మానం, శివుని విగ్రహం వద్దకు కాలిబాట, సోమగుండం చుట్టూ వాకింగ్ ట్రాక్, ఆలయం నుంచి సోమగుండం చెరువులోకి భూగర్భ డ్రైన్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులను రూ.52లక్షలతో చేపట్టారు. అలాగే ఆర్థిక సంఘం, మండల పరిషత్, జెడ్పీ నిధులు, దాతల సహకారంతో సోమగుండం పక్కనే ఉన్న రుద్రభూమిని రూ.52.1లక్షలతో చేపట్టారు.

**నాడు–నేడు.. అభివృద్ధిని చూడు**

గ్రామంలోని పాఠశాలలను మనబడి నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చేశారు. ఫేజ్–1, ఫేజ్–2లో మండల పరిషత్ మెయిన్, నెంబర్ 1, రెడ్డి కృష్ణమ్మపేట పాఠశాలలతో పాటుగా, జెడ్పీ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటుగా, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. రూ.1.18 కోట్లతో పాఠశాలల్లో ప్రత్యేక మరమ్మతులు, విద్యుద్దీకరణ, ఫర్నిచర్, ఆర్వో ప్లాంట్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేశారు. శిథిలస్థితిలో ఉన్న విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రాన్ని పూర్తిగా తొలగించి, దాని స్థానంలో రూ.4.50 లక్షల పంచాయతీ నిధులు, దాతల సహకారంతో నూతన భవన నిర్మాణం చేపట్టారు.

**ఆక్రమణల తొలగింపు**

గ్రామాభివృద్ధికి ఆటంకంగా ఉన్న ఆక్రమణల పని పట్టారు. సోమగుండం చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించి, ఆ స్థలానికి నూతనంగా మంజూరైన 33 కేవీఏ సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని కేటాయించారు. సోమేశ్వరస్వామి ఆలయానికి ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించి షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారు. అలాగే గ్రామంలో పలు చోట్ల ఆక్రమణలు తొలగించి, ప్రభుత్వ ఆస్తిని కాపాడారు. అలాగే జగనన్న ఇళ్ల పథకంలో 262 మంది లబ్ధిదారులకు కాలనీని ఏర్పాటు చేశారు.

**ఎమ్మెల్సీ సహకారంతో..**



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నా. ముఖ్యంగా దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నా. జిల్లా స్థాయిలో వచ్చిన అవార్డులు మరింత బాధ్యతను పెంచాయి.

– ఆరిఫ్, సర్పంచ్, సోమేశ్వరం, రాయవరం మండలం

**సబ్‌స్టేషన్‌కు మోక్షం**

గత ప్రభుత్వ హయాం నుంచి పరిష్కారం కాకుండా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రస్తుత సర్పంచ్ ఆరిఫ్ పాలనలో మోక్షం కలిగింది. రూ.2.68 కోట్లతో 33 కేవీఏ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు భూమిపూజ చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో లోవోల్టేజి సమస్యకు మోక్షం కలగనుంది. అలాగే రూ.8 లక్షలతో మార్కెట్ షెడ్లను అభివృద్ధి చేశారు.

**ఉత్తమ పంచాయతీగా ఎంపిక**

కేంద్ర ప్రభుత్వం 2001–02 సంవత్సరానికి తొమ్మిది కేటగిరీల్లో అవార్డులు ఇవ్వగా, సోమేశ్వరం పంచాయతీ మూడు కేటగిరీల్లో జిల్లా స్థాయిలో అవార్డులను కైవసం చేసుకుంది. ఆరోగ్యకరమైన గ్రామం, నీటి సమృద్ధి కలిగిన గ్రామం, పచ్చదనం, పరిశుభ్రత ఉన్న గ్రామాల కేటగిరీల్లో సోమేశ్వరం పంచాయతీ అవార్డులు పొంది, ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది.